నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, మంగళవారం 11 జూన్ 2024 | BHADRADRI KOTHAGUDEM

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

# అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

**భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల**

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 10 (నమస్తే తెలంగాణ) : తమ సమస్యలపై వివిధ ప్రాంతాల నుంచి వచ్చి సమర్పించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో కలిసి నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించారు. బాధితుల వివరాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్ దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు ఆమోదం కోసం పంపించారు.

- పినపాక మండలం సీతంపేటకు చెందిన వీరముష్టి శ్రీను.. తాను దివ్యాంగుడినని, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత పొందానని, తమ కార్యాలయంలో లేదా ఇతర సంస్థల్లో ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ జిల్లా ఉపాధి కల్పన అధికారికి దరఖాస్తు అందజేశారు.
- అశ్వాపురం మండలం చింతిర్యాలకు చెందిన తోట శ్రీనివాసరావు.. తనకు వారసత్వంగా వచ్చిన భూమిపై పెద్దనాన్న, ఆయన కుటుంబ సభ్యులు అక్రమంగా పాస్ పుస్తకం పొందారని, ఈ భూమిపై మేమే సాగులో ఉన్నామని, తన వద్ద ఉన్న పూర్తి ఆధారాలను పరిశీలించి ఆ పాస్ పుస్తకం రద్దు చేసి తన పేరు ఎక్కించాలని దరఖాస్తు చేసుకున్నాడు.
- పాతకొత్తగూడెంకు చెందిన షేక్ అల్తాఫ్.. తనకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిని కరోనా సమయంలో ఇతరులు ఆక్రమించారని, తనకు న్యాయం చేయాలని అర్జీ సమర్పించాడు. కాగా.. ఆయా దరఖాస్తులను స్వీకరించిన కలెక్టర్ వాటిని పరిశీలించి ఆయా శాఖల అధికారులకు ఆమోదం కోసం పంపించారు.

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్వో రవీంద్ర నాథ్, డీఆర్‌డీవో విద్యాచందన, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ వినతులపై దృష్టి పెట్టండి

**ఖమ్మం అదనపు కలెక్టర్ సత్యప్రసాద్**

దరఖాస్తులు స్వీకరిస్తున్న ఖమ్మం అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

ఖమ్మం, జూన్ 10 : అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో అర్జీదారుల నుంచి అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్‌తో కలిసి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. తగు చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు వాటిని ఎండార్స్ చేశారు.

- తిరుమలాయపాలెంకు చెందిన నేలమలి ఏసుబాబు సర్వే నెంబర్ 133/5లో గల 0.20 ఎకరాల తన భూమిని వేరే వ్యక్తి ఆక్రమించుకున్నాడని, తనకు న్యాయం చేయాలని వినతిపత్రం సమర్పించారు.
- వేంసూరు మండలం ఎర్రగుంటపాడుకు చెందిన వాసం లక్ష్మయ్య తన రెండెకరాల భూమికి పాస్ పుస్తకం ఉన్నదని, తన భూమిని సర్వే చేయించాలని అర్జీ సమర్పించారు.
- ఎర్రుపాలెం మండలం మామునూరు మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో తమకు వృత్తి, నైపుణ్య పరీక్షలు నిర్వహించి, సభ్యత్వం ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నారు.
- ఖమ్మం శ్రీరామ్ నగర్‌కు చెందిన కొత్తపల్లి శ్రీనివాసరావు.. తనకు చింతకాని మండలం పాతర్లపాడులో సర్వే నెంబర్ 19, 19/ఇ లో 2.04 కుంటల భూమి ఉన్నదని, పట్టాదారు కాలం, అనుభవదారుని కాలంలో తన తండ్రి పేరుకు బదులుగా ఇతరుల పేర్లు ఉన్నాయని, దానిని సరి చేయాలని వినతిపత్రం సమర్పించారు.
- సత్తుపల్లికి చెందిన పఠాన్ పాషా.. తనకు పక్షవాతం వచ్చి కాలు, చేయి పనిచేయక చేయడం లేదని, తనకు దివ్యాంగుల పెన్షన్ ఇప్పించి ఆదుకోవాలని కోరారు.
- పాల్వంచకు చెందిన ఎండీ అమీనా బేగం.. తన కొడుకు తన భర్త ఉద్యోగం తీసుకున్నాడని, ఇప్పుడు తనను పట్టించుకోవడం లేదని, తన కుమారుడి వేతనం నుంచి సగం వేతనం ఇప్పించాలని విన్నవించారు.
- ఖమ్మం శ్రీరాంనగర్ రోడ్ నెం.9కు చెందిన బత్తుల వెంకటేశ్వర్లు.. ధంసలాపురం సర్వే నెంబర్ 55ఈ, 55ఉ, 55ఊ, 55రు, 55రూ, 55లు, 55లో గల వెంచర్‌లకు లే అవుట్ పర్మిషన్ ఉన్నదీ లేనిదీ తెలియజేసి, తనకు డాక్యుమెంట్లు ఇప్పించాలని కోరారు.
- ఖమ్మం నగరానికి చెందిన సీహెచ్.వెంకటరమణ.. తాను దివ్యాంగుడినని, ఎంఏ, బీఈడీ చదివానని, తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని వినతిపత్రం సమర్పించారు.
- ఖమ్మం ట్రంక్ రోడ్‌కు చెందిన జూలకంటి రమణమ్మ.. తన భర్త స్వాతంత్ర్య సమరయోధుడిగా పెన్షన్ పొందేవారని, ఆయన చనిపోయాక ఆర్థిక ఇబ్బందులు వచ్చాయని, ప్రభుత్వ పథకాలు, ఇంటి స్థలం ఇప్పించి ఆదుకోవాలని కోరారు.
- ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడులోని సర్వే నెం. 7, 10, 11, 12లో గల భూముల పాస్ బుక్ దారులు ఎన్‌వోసీ మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు.
- ఖమ్మం రూరల్ మండలం పెద్దతండాకు చెందిన బి.సత్యనారాయణ.. మున్నేరు బ్రిడ్జి నుంచి పెద్దతండా వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్లు పెండింగ్ గ్రీవెన్స్ దరఖాస్తులపై సమీక్షించి వెంటనే వాటిని పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఆర్డీవో జి.గణేశ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ధరణి పెండింగ్ ఫైళ్లు పరిష్కరించండి

**అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్**

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

ఖమ్మం, జూన్ 10 : పెండింగ్‌లో ఉన్న ధరణి ఫైళ్ల పరిష్కారాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ అధికారులతో ధరణి, రిజిస్ట్రేషన్ల పెండింగ్‌పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి ఫిజికల్ ఫైళ్ల ఆన్‌లైన్ అప్‌లోడ్ ప్రక్రియలో వేగం పెంచాలన్నారు. తహసీల్దార్లు ఫిజికల్ ధరణి ఫైళ్లను అప్‌లోడ్ చేస్తే.. ఆర్డీవోల లాగిన్‌కు వస్తాయని, వాటిని ఆర్డీవోలు పరిశీలించి అదనపు కలెక్టర్‌కు సమర్పించాలన్నారు. పెండింగ్ స్లాట్ల పరిష్కారం వెనువెంటనే పూర్తి చేయాలన్నారు. పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

# పుస్తకాలు లేవ్.. చదివేదెట్టా..!

**ఖమ్మం జిల్లాలో ఇంటర్మీడియట్ విద్య అగమ్యగోచరంగా మారింది. ఈ ఏడాది విద్యా సంవత్సరం ఇప్పటికే ప్రారంభమైనప్పటికీ పాఠ్య పుస్తకాలు జిల్లాకు ఇంకా చేరలేదు. మొదటి, ద్వితీయ సంవత్సరం పుస్తకాలు ఒక్కటి కూడా రాలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కళాశాలలు పునః ప్రారంభమైన రోజు నుంచే ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను ఉచితంగా అందజేయాల్సి ఉంది. కానీ ఇంటర్మీడియట్ ఉన్నతాధికారులు పట్టించుకోక పోవడం విద్యార్థులకు శాపంగా మారింది.**

*– ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 10*

**జిల్లాకు చేరని ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాలు**

**ద్వితీయ సంవత్సరానికి 28వేల బుక్స్ అవసరం**

**ఇప్పటికే ప్రారంభమైన సెకండియర్ క్లాసులు**

**విద్యార్థులకు శాపంగా మారిన వైనం**

**పట్టించుకోని విద్యాశాఖ అధికారులు**

జిల్లాలో మొత్తం 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వాటిల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జనరల్, ఒకేషనల్ కోర్సుల్లో కలిపి 3,107 మంది ఉన్నారు. వీరికి 27,640 పుస్తకాలు అవసరమని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారులు ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. గత సంవత్సరం జిల్లాకు వచ్చిన పాఠ్యపుస్తకాల్లో 5,458 ద్వితీయ సంవత్సరం పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. అయితే ఈ పుస్తకాలనే ఈ ఏడాది ద్వితీయ సంవత్సర విద్యార్థులకు అందజేసిన అధికారులు.. కొత్త పుస్తకాలు జిల్లాకు చేరాయనీ.. వాటినే అందజేశామని పేర్కొనడం గమనార్హం. ప్రస్తుతం ఒక విద్యార్థికి ఇచ్చిన పుస్తకాన్నే ఇద్దరు ముగ్గురు చదవాల్సిన పరిస్థితి దాపురించింది.

### ఎప్పటికి చేరతాయో...

ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై వారంరోజులవుతున్నది. అయినా జిల్లాకు రావాల్సిన పుస్తకాలు ఇంకా రాలేదు.. సకాలంలో అందుతాయో లేదో అన్నది కూడా అనుమానమే. ప్రైవేట్ బుక్‌స్టాల్స్‌లో కొనుక్కుందామంటే ధరలు మండిపోతున్నాయి. సైన్స్ గ్రూప్‌కి సంబంధించిన పుస్తకాలు రూ.1500 నుంచి రూ.2వేల వరకు ఉన్నాయి. ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారులు దృష్టి సారించి కొత్త పాఠ్యపుస్తకాలు సకాలంలో చేర్చడానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

### బీఆర్ఎస్ హయాంలో..

తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందించేలా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. ఇంటర్ పుస్తకాలు సుమారు రూ.2 వేల వరకు ఉంటాయి. వీటిని కొనలేని విద్యార్థులకు అప్పటి సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం వరంలా మారింది. చదువులకు ఎంతగానో ఉపయోగపడింది. వీటితోపాటు అడ్మిషన్ ఫీజు అప్పట్లో కోర్సుల ఆధారంగా రూ.375 నుంచి రూ.1500 వరకు ఉండేది. కేసీఆర్ ప్రభుత్వంలో ఈ అడ్మిషన్ ఫీజును తొలగించి ఉచితంగా ప్రవేశాలు కల్పించింది. దీంతో జూనియర్ కళాశాలలు కళకళలాడాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ కూడా చెల్లించింది. విద్యార్థులకు అవసరమైన నాణ్యమైన విద్యను అందించేందుకు పటిష్ట ప్రణాళికలతో ప్రత్యేక శ్రద్ధ కనబర్చింది.

### ఉన్నవాటిని అందిస్తున్నాం..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న పుస్తకాలను అందిస్తున్నాం. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన పుస్తకాలు ఇంకా రాలేదు. విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటాం. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం కానివ్వం.

**– రవిబాబు, డీఐఈవో, ఖమ్మం**

# ఈసెట్ కౌన్సెలింగ్ షురూ..

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 10 : టీజీ ఈసెట్ కౌన్సెలింగ్ ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో సోమవారం నుంచి ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకీరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన, 14 వరకు వెబ్ ఆప్షన్, 18న మొదటి విడత సెట్ల కేటాయింపు, 21 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ ఉంటుందని తెలిపారు. జూలై 15 నుంచి 17 వరకు చివరి విడత కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. మొదటి రోజు 249 మంది విద్యార్థులు స్లాట్ నమోదు చేసుకోగా.. 235 మంది హాజరయ్యారని తెలిపారు.

# బీఈడీ సెమిస్టర్ ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత

భద్రాచలం, జూన్ 10 : కాకతీయ యూనివర్సిటీ అధికారులు ప్రకటించిన బీఈడీ ఫైనల్ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో గిరిజన బీఈడీ కళాశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో చివరి సెమిస్టర్ పరీక్షలకు 94 మంది విద్యార్థులు హాజరయ్యారని, వారిలో అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. అందులో 7.79 సీజీపీఏతో కొప్పు మౌనిక ప్రథమ, 7.76 సీజీపీఏతో ద్వితీయ స్థానంలో వాంకుడోత్ సంతోశ్‌కుమార్, 7.68 సీజీపీఏతో ద్వితీయ స్థానంలో పూనెం తనూజ నిలిచారని తెలిపారు. కాగా.. యూనివర్సిటీ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేసిన ప్రిన్సిపాల్ వీరునాయక్, అధ్యాపకులు, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మను పీవో అభినందించారు.

# 'అగ్రి' విద్యార్థినులు 'గోల్డ్'

**వివిధ అంశాల్లో బజ్జూరి దివ్యకు ఆరు బంగారు పతకాలు**

అవార్డు అందుకుంటున్న విద్యార్థిని సాహితి

ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని దివ్య

అశ్వారావుపేట, జూన్ 10 : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థాయిలో పలు అంశాల్లో నిర్వహించిన పోటీల్లో అశ్వారావుపేట కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాల పంట పండించారు. హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో సోమవారం జరిగిన 6వ స్నాతకోత్సవ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయం చాన్సలర్ సీపీ రాధాకృష్ణన్ చేతుల మీదుగా పతకాలు అందుకున్నారు. కళాశాలకు చెందిన విద్యార్థిని బజ్జూరి దివ్య విశ్వవిద్యాలయం స్థాయిలో అత్యధిక ఓవరాల్ గ్రేడ్ పాయింట్లు సాధించి ఆరు బంగారు పతకాలను సొంతం చేసుకున్నది. పసుపులేటి సాహితి అకాడమిక్, కో-కరిక్యూలర్ విభాగంలో అద్భుత ప్రదర్శనకు బంగారు పతకాన్ని సాధించింది. దివ్య అత్యధిక ఓవరాల్ గ్రేడ్ పాయింట్‌కు ది అగ్రి హార్టి-1983 బ్యాచ్ రాజేంద్రనగర్ గోల్డ్ మెడల్, సాయిల్ సైన్స్, అగ్రికల్చరల్ కెమిస్ట్రీలో అత్యధిక ఓవరాల్ గ్రేడ్ పాయింట్‌కు ది 79 అన్నుల్ కన్వెన్షన్ ఆఫ్ ఇండియన్ సొసైటీ ఆఫ్ సాయిల్ సైన్స్ కామెమోరటీవ్ గోల్డ్ మెడల్, అగ్రోనోమి సబ్జెక్ట్‌లో ఓవరాల్ గ్రేడ్ పాయింట్‌కు అగ్రికోస్-1980 బ్యాచ్ రాజేంద్రనగర్ గోల్డ్ మెడల్, ఎంటోమోలజీ సబ్జెక్ట్‌లో ఓవరాల్ గ్రేడ్ పాయింట్‌కు డాక్టర్ బీహెచ్ కృష్ణమూర్తిరావు మెమోరియల్ గోల్డ్ మెడల్, ప్లాంట్ పాథాలజీ సబ్జెక్టులో ఓవరాల్ అత్యధిక గ్రేడ్ పాయింట్‌కు శ్రీరాజారామ్ వెంగళదాస్ మెమోరియల్ గోల్డ్ మెడల్, జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్ సబ్జెక్టులో ఓవరాల్ గ్రేడ్ పాయింట్‌కు ఆర్ఏ/1982 అగ్రికోస్ రాజేంద్రనగర్ గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది. కాగా.. ఉత్తమ అవార్డులు దక్కించుకున్న విద్యార్థినులకు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్, అధ్యాపకులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## పెండింగ్ వేతనాల కోసం

# కార్మికుల ఆందోళన

**ఒక నెల జీతం విడుదల చేసిన ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్**

భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు

భద్రాచలం, జూన్ 10 : ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఔట్ సోర్సింగ్ కార్మికులు భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఎదుట సోమవారం మళ్లీ ఆందోళన చేపట్టారు. కార్మికులు ఆస్పత్రి ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగడంతో శానిటేషన్ పనులు నిలిచిపోయాయి. దీంతో స్పందించిన ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ కార్మికులకు తక్షణమే ఒక నెల వేతనం మంజూరు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేశ్ మాట్లాడుతూ బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి.. అతడి కాంట్రాక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నా కార్మికుల ఆకలి బాధలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాగా.. కార్మికులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అక్కడికి చేరుకొని మిగతా పెండింగ్ వేతనాలను పది రోజుల్లో చెల్లించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు. పది రోజుల్లో సమస్యను పరిష్కరించకుంటే తిరిగి సమ్మె కొనసాగిస్తామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, ఏరియా ఆస్పత్రి ఔట్ సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పాం రైతుల సమస్యలపై ఎండీకి వినతి


వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

అశ్వారావుపేట, జూన్ 10 : రాష్ట్ర వ్యాప్తంగా ఆయిల్‌పాం సాగు విస్తరిస్తున్న దృష్ట్యా పరిశోధనా కేంద్రంతో పాటు రైతు శిక్షణా కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్‌పాం గ్రోవర్స్ సొసైటీ అధ్యక్షుడు తుంబూరి ఉమామహేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి కొక్కెరపాటి పుల్లయ్య ఆయిల్‌ఫెడ్ ఎండీ, రాష్ట్ర హార్టికల్చర్ కమిషనర్ కె.అశోక్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ ఆయిల్‌ఫెడ్ కార్యాలయంలో ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు అనుబంధంగా కొత్త వంగడాల కోసం పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, అలాగే ఆయిల్ రికవరీ లెక్కింపు కోసం టన్ను సామర్థ్యంతో యూనిట్‌ను మంజూరు చేయాలని కోరారు. భూసార పరీక్షల ఆధారంగా నాణ్యమైన మొక్కలు పంపిణీ చేయాలని, నాణ్యత లేని మొక్కలు వేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పామాయిల్ గెలల ధర నిర్ణయంలోనూ సరైన నిర్ణయం ప్రకటించాలని కోరారు. సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన ఆయన తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసినట్లు వారు తెలిపారు.

# దొడ్డా..? సన్నాలా..?

- **విత్తనాల ఎంపికపై ఎటూ తేల్చని కాంగ్రెస్ సర్కారు**
- **వర్షాలు షురువైనా పట్టించుకోకపోవడంతో అయోమయం**
- **వంగడాల ఎంపికపై స్పష్టత ఇవ్వాలని రైతుల డిమాండ్**

భూమిలో కరివేద చల్లేందుకు దుక్కులు సిద్ధం చేస్తున్న రైతు

పెనుబల్లి, జూన్ 10 : నైరుతి రాకతో వర్షాకాలం సీజన్ ఆరంభమైంది. జిల్లాలో అడపా దడపా వానలు కురుస్తున్నాయి. వర్షాలతో భూమి తడిచిన ప్రాంతాల్లో పాత పంట చెత్తను తొలగించి.. దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. అయితే విత్తన ఎంపిక విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎటూ తేల్చకపోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. మంత్రులు ఒకరికొకరు పొంతన లేకుండా సన్న వడ్లకు బోనస్ ఇస్తాం.. దొడ్డు రకానికి.. అది కూడా వచ్చే వానకాలం సీజన్ నుంచి అంటూ చెప్పుకొస్తున్నారు. దీంతో అసలు ఏ రకం వడ్లకు బోనస్ ఇస్తారు? ఏ రకం పండించుకోవాలి? అనేది స్పష్టత ఇస్తే బాగుంటుందని రైతులు కోరుతున్నారు. రోహిణి కార్తె ముగిసే సమయానికి ముందుగానే నైరుతి రుతుపవనాలు జిల్లాను తాకడంతో మోస్తరుగా కురుస్తున్న వర్షాలతో రైతన్నలు సాగుపై దృష్టి పెట్టారు. ముందుగా దుక్కులు దున్ని కొందరు రైతులు కరివేద చల్లాలని సిద్ధమవుతున్నారు. మరోపక్క ఎన్నెస్పీ ఆయకట్టు కింద ఉన్న రైతులు ముందుగానే వరి నార్లు పోయాలని నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. అయితే కరివేద విధానంలో సాగు చేసే రైతులు, సాగర్ కాల్వ కింద ఉన్న రైతులు, బోరుబావుల కింద పండించే రైతులు ఏ వరి విత్తనాలు కొనాలి? ఏ విత్తనాలు పండిస్తే ప్రభుత్వం మద్దతుకు కొనుగోలు చేస్తుంది? అనే అంశంపై స్పష్టత ఇచ్చేవారు కరువయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల ఏమాత్రం ప్రేమ ఉందో విత్తనాల ఎంపికలోనే అర్థమవుతుందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు వరికి బోనస్ అందించడంపై దృష్టి సారించి.. వరి వంగడాల ఎంపికపై స్పష్టత ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వ్యవసాయ శాస్త్రవేత్తల నిర్ణయం ప్రకారం రైతులు ఆయా ప్రాంతాల భూములను బట్టి మంచి వంగడాలపై దృష్టి సారిస్తున్నారు. కరివేద చల్లడం మంచి విధానం. అలాగే వరి నారు పోసి నాట్లు వేయడం కూడా మంచి విధానమే. ఈ ప్రాంతంలో

### జాగ్రత్తలు పాటిస్తే దిగుబడులు

బీపీటీ సాంబ ధాన్యంపై రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. సాగు విధానంలో తగిన జాగ్రత్తలు పాటించినట్లైతే సాంబ దిగుబడి ఉంటుంది.

**– ప్రసాదరాజు, వ్యవసాయాధికారి, పెనుబల్లి**

### ఏమీ అర్థం కావట్లేదు

ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో నాకు నాలుగెకరాల సొంత భూమి ఉంది. దానికితోడు పదెకరాలు ఏటా కౌలుకు తీసుకొని చేస్తుంటాను. గత ఏడాది దొడ్డు వడ్లకు ప్రాధాన్యం ఇచ్చి ముందుగానే నారు పోసి నాట్లు వేసేవాళ్లం. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సన్న వడ్లకే మద్దతు ధర ఇస్తామని చెప్పడంతో ఎటూ అర్థం కావట్లేదు. రైతులు ఏ విత్తనాలు నారు పోయాలో.. లేదా అన్ని వడ్లకు ప్రభుత్వం బోనస్ ఇస్తుందో తెలపాలి.

**– వెలుగల కృష్ణయ్య, రైతు, పెనుబల్లి**

### రోజుకో మాట.. పూటకో ప్రకటన

రైతులు పండించే ధాన్యంపై కాంగ్రెస్ ప్రభుత్వం రోజుకో మాట.. పూటకో ప్రకటన చేస్తుండడంతో ఆందోళనగా ఉంది. ప్రభుత్వం సన్న వడ్లకే బోనస్ ఇస్తామని చెప్పడం.. అందరూ ఆ పంట వేస్తే మళ్లీ కొనుగోళ్ల సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ప్రభుత్వమే అన్ని వడ్లకు మద్దతు ధర కల్పిస్తామని, లేదంటే కొన్ని వడ్లకే ఇస్తామని చెబితే ఆ దిశగా పంటల సాగులో ముందుకెళ్తాం.

**– గోదా శ్రీనివాసరావు, రైతు, వీఎం బంజర**